# నమస్తే తెలంగాణ
## భద్రాద్రి కొత్తగూడెం

3 | ఖమ్మం, ఆదివారం 17 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM



కొత్తగూడెం అర్బన్ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు


మధిర : మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు


బోనకల్లులో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


అశ్వారావుపేట : కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు


చండ్రుగొండ : జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఇల్లెందు : కవిత అక్రమ అరెస్టుకు నిరసనగా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ


వైరాటౌన్ : నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, బీఆర్ఎస్ నాయకులు


సత్తుపల్లి : అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణుల నిరసన


కల్లూరులో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు


ముదిగొండ : నిరసన తెలుపుతున్న నాయకులు

# కమలంపై కన్నెర్ర

- ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహజ్వాలలు
- మండల కేంద్రాల్లో ధర్నాలు, నిరసనలు
- ప్రధాని మోదీ దిష్టిబొమ్మల దహనం
- బీజేపీ నీచ రాజకీయాలు మానుకోవాలని హితవు
- బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేకనే వేధింపులంటూ మండిపాటు

ఖమ్మం, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో ఛీప్ పాలిట్రిక్స్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నేతలను ఇబ్బంది పెడుతున్నదని ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో బీఆర్ఎస్ శ్రేణులు భారీగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎక్కడచూసినా నిరసనలు, నినాదాలతో మండల కేంద్రాలు హోరెత్తాయి. రహదారులపై మండుటెండలో కూర్చొని బీజేపీ తీరును, ఈడీ అధికారుల వ్యవహారశైలిని తప్పుబట్టారు. ఒక్కటికాదు.. రెండుకాదు పదేండ్లుగా బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకు అనేక కుట్రలు చేసిందని ఆరోపించారు. ఈ సందర్భంగా బీజేపీ, ప్రధానమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఖమ్మం నగరంలో సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ, కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, మాజీ కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు షేక్ షకీనాతో పాటు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మధిర మండల కేంద్రంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి రహదారిపై నిరసనకు దిగారు. కవిత అక్రమ అరెస్టును ఖండిస్తూ నినాదాలు చేశారు. మండల పార్టీ ఆధ్వర్యంలో చండ్రుగొండలో భారీ ధర్నా జరిగింది. కండ్లకు నల్లకండ్లద్దాలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. వైరా పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, పీఎం నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సత్తుపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మండల పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేశారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు కోనేరు సత్యానారయణ పాల్గొన్నారు. ఇల్లెందు, టేకులపల్లి, సారపాక, ఖమ్మం జిల్లాకేంద్రంలో సైతం బీఆర్ఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల నరేంద్రమోదీ దిష్టిబొమ్మలను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


ఖమ్మంలో కవిత అరెస్టుకు నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


సారపాక ప్రధాన సెంటర్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఇల్లెందు : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


వీ.ఎం.బంజర రింగ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ పెనుబల్లి మండల నాయకులు

# మోగిన నగారా

- అమల్లోకి ఎన్నికల కోడ్
- వేడెక్కిన ఉమ్మడి ఖమ్మంజిల్లా రాజకీయం
- ప్రచారంలో బీఆర్ఎస్ ముందంజ
- ఇంకా అభ్యర్థులనే ప్రకటించని ప్రధాన పార్టీలు
- బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు


నగరంలో వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది



ఖమ్మం, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల నగారా మోగింది. కేంద్ర ఎన్నికల కమిషన్ శనివారం షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లపై మరింత దృష్టి సారించింది. ఇప్పటికే ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది, అధికారుల నియామకాలను పూర్తిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించడంతో నాల్గోవిడత మే 13వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అధికారిక కార్యక్రమాలకు బ్రేక్ పడింది. ఏప్రిల్ 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీకానుంది. అదేరోజు నుంచి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల దాఖలుకు ఏప్రిల్ 25 చివరితేదీ కాగా ఉపసంహరణకు 29వ తేదీ వరకు గడువు ఉంది.

### వేడెక్కిన జిల్లా రాజకీయం..

షెడ్యూల్ విడుదలతో ఉమ్మడి ఖమ్మంజిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఉమ్మడిజిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఖమ్మం లోక్‌సభ పరిధిలోకి 7 నియోజకవర్గాలు వస్తాయి. మరో 3 నియోజకవర్గాలు మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ నెల రోజుల క్రితమే సమాయత్తమై పార్టీ శ్రేణులను కార్యోన్ముఖులను చేసింది. బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి ప్రస్తుత ఎంపీ, బీఆర్ఎస్ లోకసభ పక్షనేత నామా నాగేశ్వరరావును మరోసారి అభ్యర్థిగా ప్రకటించారు. నామా అభ్యర్థిత్వం పార్టీలో ఉత్తేజం నింపగా ఖమ్మంలో పార్టీ శ్రేణులు ఇటీవల సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 1 లక్షా 66వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందిన నామా ఈసారి అదే రీతిలో గెలిచే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ విజయాలు, లక్ష్యాలను ప్రచారం చేయాలని పార్టీ అధినేత కేసీఆర్ వారికి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సమయం సమీపిస్తున్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీలు ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిని ఇప్పటివరకు నిర్ణయించకపోవడంతో ఆయా పార్టీ కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. ఖమ్మంజిల్లాలో ఒకప్పుడు కీలకంగా ఉన్న వామపక్ష పార్టీలు ఈ ఎన్నికల్లో ఏ పార్టీతో కలిసి నడుస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ మాత్రమే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నది. పార్టీ శ్రేణులను సమాయత్తం చేసి వ్యూహ, ప్రతివ్యూహాలపై కార్యోన్ముఖులను చేస్తున్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో గత లోక్‌సభ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఇక ఎన్నికల నిర్వహణకు అధికారులు ఆగమేఘాల మీద ఏర్పాట్లు చేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య సుమారు 5 వేల వరకు పెరగడంతో అధికారులు ఆ దిశగా సమాయత్తమవుతున్నారు. దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటివద్దనే ఓటువేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు ఉంటాయని తెలిపింది.

### నియోజకవర్గాల వారీగా ఇలా..

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ట్రాన్స్‌జెండర్స్ | మొత్తం |
|---|---|---|---|---|
| ఖమ్మం | 1,54,837 | 1,68,203 | 51 | 3,23,091 |
| పాలేరు | 1,15,201 | 1,24,301 | 08 | 2,39,510 |
| మధిర | 1,06,787 | 1,14,573 | 10 | 2,21,370 |
| వైరా | 93,412 | 99,168 | 06 | 1,92,586 |
| సత్తుపల్లి | 1,18,006 | 1,24,668 | 12 | 2,42,686 |
| కొత్తగూడెం | 1,19,715 | 1,27,921 | 33 | 2,47,669 |
| అశ్వారావుపేట | 77,044 | 81,172 | 07 | 1,58,223 |
| మొత్తం | 7,89,130 | 8,35,878 | 127 | 16,25,135 |

### ఓటర్ల వివరాలు..

లోక్‌సభ నియోజర్గవ్యాప్తంగా అధికారులు తుది ఓటర్ల జాబితాను రూపకల్పన చేశారు. 7 నియోజకవర్గాల్లోని 1,893 పోలింగ్‌స్టేషన్లలో ఓటర్ల జాబితాను సవరించారు. నియోజకవర్గాల్లోని ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోతోపాటు బూత్‌లెవల్ అధికారులకు ఆయా గ్రామాల్లో ఉన్న ఓటర్ల వివరాలను అందుబాటులో ఉంచారు. తుది ఓటర్ల జాబితాను అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రచురించారు. పురుషులు–7,89,130 మహిళలు–8,35,878 మంది ఓటర్లు ఉన్నారు. వీరితోపాటు ట్రాన్స్‌జెండర్లు–127 వరకు తమ ఓటును నమోదు చేసుకున్నారు. మొత్తంగా 1,625,135 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు ప్రకటించారు.

# కాంగ్రెస్‌వన్నీ మాయమాటలే..

**వాటితోనే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది**

**ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించండి**

**ఎన్నికల్లో లబ్ధికోసమే ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టు**

**చర్ల పర్యటనలో మహబూబాబాద్ ఎంపీ కవిత**

**నాటి కేసీఆర్ మాటలు నిజమయ్యాయి: తాతా, రేగా**


మాట్లాడుతున్న ఎంపీ కవిత, చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

చర్ల, మార్చి 16: కాంగ్రెస్‌వన్నీ మాయమాటలేనని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత విమర్శించారు. వాటి వల్లనే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని అన్నారు. కానీ ఎన్నికల హామీలను కూడా నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. చర్లలో శనివారం పర్యటించిన ఆమె.. మొదట బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో, తరువాత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేస్తామంటూ గొప్పలు చెప్పిన కాంగ్రెస్ పాలకులు.. వంద రోజులు అవుతున్నా ఆ హామీలను ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అక్రమమని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే బీజేపీ, కాంగ్రెస్ కుట్ర పన్ని ఆమెను అరెస్టు చేయించాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు కష్టాలు తప్పవని బీఆర్ఎస్ అధినేత ఆనాడే అన్నారని గుర్తుచేశారు. ఆ మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయని అన్నారు. ప్రజలు కూడా నిజాలు గ్రహించారని, ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించనున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. మాలోత్ కవితను గెలిపించేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు మానే రామకృష్ణ, శ్రీనివాసరాజు, రావులపల్లి రాంప్రసాద్, సోయం రాజారావు, పోలిన లంకరాజు, గీద కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ది బెస్ట్

## రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

- ఖమ్మం జిల్లాలో 97 రెగ్యులర్ సెంటర్లు
- హాజరుకానున్న 16,514 మంది విద్యార్థులు
- తొలిసారిగా పరీక్ష గదుల్లో సీసీ కెమెరాలు
- పరీక్ష మొదలైన 5 నిమిషాల వరకే అనుమతి
- జిల్లా అబ్జర్వర్‌గా జేడీ సర్వీసెస్ మదన్‌మోహన్

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 16: టెన్త్ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్ష ప్రారంభమైన 5 నిమిషాల అనంతరం విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. 97 కేంద్రాల్లో జరుగనున్న ఈ పరీక్షలకు 16,514 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకానున్నారు. సిట్టింగ్ స్కాడ్‌లో 97 మంది, ఫ్లయింగ్ స్కాడ్‌లో ఆరుగురితో కూడిన బృందాలు పరీక్షలను పర్యవేక్షించనున్నాయి. వెయ్యి మందికి పైగా ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తించనున్నారు. విద్యాశాఖ జేడీ సర్వీసెస్ మదన్‌మోహన్ టెన్త్ పరీక్షల జిల్లా అబ్జర్వర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణ అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించనున్నారు. కాగా, పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను నేరుగా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో చూసేలా ఏర్పాట్లు చేశారు. వీటితోపాటు 97 కేంద్రాల్లోని సుమారు 950కి పైగా గదుల్లో పరీక్షలు జరుగనుండగా కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిల్లో 300 గదుల్లో తొలిసారిగా సీసీ కెమెరాలను అమర్చారు. కాగా, పరీక్షల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా డీఈవో సోమశేఖరశర్మ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. 8331851510 నెంబరును కేటాయించి కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు.


ఖమ్మం అబ్జర్వర్ మదన్‌మోహన్


భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరచారి

### 'భద్రాద్రి'లో 12,341 మంది రెగ్యులర్ విద్యార్థులు: డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 16: ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు. జిల్లాలో మొత్తం 12,341 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు చెప్పారు. రెగ్యులర్ విద్యార్థుల కోసం 70 సెంటర్లు, సప్లిమెంటరీ విద్యార్థుల కోసం 3 సెంటర్లు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మొత్తం 73 సెంటర్లకుగాను 73 చీఫ్ సూపరింటెండెంట్లు, 73 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 887 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వివరించారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగుతాయని, పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లుగానీ ఎలక్ట్రానిక్ వస్తువులనుగానీ అనుమతి లేదని అన్నారు. హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇతర వివరాల కోసం ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావును 9989027943 నెంబరులో సంప్రదించాలని డీఈవో సూచించారు.

# పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

**ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలి: భద్రాద్రి కలెక్టర్**


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 16 (నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు. స్థానిక ఐడీవోసీలో శనివారం జరిగిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసిందని, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వస్తుందని అన్నారు. ఏప్రిల్ 18 నుంచి 26 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 26 వరకు నామినేషన్ల స్క్రూట్నీ, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4 న కౌంటింగ్ ఉంటాయని వివరించారు. జిల్లాలో 1095 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా జిల్లాలో అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, వివిధ శాఖల అధికారులు వెంకటేశ్వరచారి, రవి, తిరుమలరావు, దారా ప్రసాద్, సుశీల్, నవీన్ పాల్గొన్నారు.